# దోసెడు మల్లెలు

మీనారాణి పాతికేళ్ళు నిండిన అందమైన అమ్మాయి. ఇంకా కుమారి మీనారాణిగానే వుంది. రచయిత్రిగా ఆమె వయసు పది సంవత్సరాలు. మొదటి కథ తన పదిహేనవయేట రాసిందట. ఆమె కథలు అంటే పాఠకులు చెవి కోసుకుంటారు. మేధావులు కూడా మెచ్చుకుంటారు. చిన్న విషయాన్ని తీసుకొని ఎంతో తీయగా, అందంగా – మరచిపోలేకుండా కథను అల్లే నేర్పు ఆమె సొత్తు.

ఇంట్లో అమ్మా నాన్నా వున్నారు ఆమెకు. ఓ బావ కూడా వున్నాడు. బావ అందగాడే. ఎప్పుడూ తెల్ల పైజామా, సిల్కు లాల్చీ వేసుకుంటాడు. ఉంగరాల గిరజాల జుట్టు. పచ్చని ఛాయ. రోమన్ వీరుని ముక్కులాంటి ముక్కు. ఎంతో ఆకర్షణగల మెరిసే కళ్ళు. రోజులో ఎక్కువసేపు యీజిల్ ముందు నిలబడి ఏవేవో చిత్రాలు రాస్తుంటాడు. అతను అలా యీజిల్ ముందు నిలబడినా, మీనా రాణీ వెంట కారులో బయటకు వెళ్ళినా చూసేవాళ్ళకి మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే అందం అతనిది.

అంతటి అందగాడికి దేవుడిచ్చిన శాపం మూగతనం. మాటలు వినబడతాయి. మాటాడలేడు. అయినా అతని కళ్ళు ముఖకవళికలూ మాటలకందని భావాలను వ్యక్తం చేయగలవు.

మీనారాణి తను రాసిన మొట్టమొదటి కథ తన బావకు వినిపించింది చదివి. సైగలతోటే బాగుందన్నాడు. చూపులతోటే అభినందించాడు. అది అచ్చయింది ఓ పత్రికలో. అప్పటినుంచీ ఏ కథ రాసినా, నవల రాసినా బావకు వినిపించకుండా పంపించేది కాదు. అతను ఆమెకు సలహాదారుడు. తన రచనలకు ఖరీదు కట్టే షరాబు – బావకు నచ్చితే అందరికీ నచ్చుతుందని ఆమె నమ్మకం. రాసేటప్పుడు బావకు నచ్చదేమోనని భయపడుతూనే రాస్తుంది. అతనికి నచ్చేలా రాయటమే ఆమె ధ్యేయం. అతని అభిరుచి మీద ఆమెకంత నమ్మకం. అంత తెలివైన బావకు మాటలు రావు. మాట్లాడుతున్నట్లు జీవకళ ఉట్టిపడేలా బొమ్మల్ని గీయగల బావ మాట్లాడలేడు. అది ఆమె నిత్య ఆవేదన –

కాని బావ ఏనాడూ తనకు మాటలు రావని బాధపడలేదు. పడినా అతని చూపుల్లో వ్యక్తమయ్యేది కాదు ఆ బాధ. అతను గొప్ప ఆత్మవిశ్వాసం గల వ్యక్తి.

అటువంటి బావనే కథానాయకునిగా తీసుకొని కథరాసింది మీనారాణి. ఆ కథ రాసినప్పుడు బావ ఏదో ఆర్ట్ ఎగ్జిబిషన్ హడావిడిలో వూరు కెళ్ళాడు.

ఆ సమయంలో అతనికి చదివి వినిపించకుండానే ఆ కథను పోటీకి పంపించింది.

కథ బహుమతి గెలుచుకుంది.

నగరంలోని సాహిత్యాభిమానులు మీనారాణికి అభినందన సభ ఏర్పాటు చేశారు.

మీనారాణి వెంట ఆమె బావకూడా వెళ్ళాడు ఆ సభకు. నగరంలోని కొందరు రచయితలు, రచయిత్రులు, విమర్శకులూ, పెద్దలూ మీనారాణి రాసిన కథ గురించి ఎంతగానో పొగిడారు. కథను విశదంగా మళ్ళీ చెప్పి – ఆ కథ బహుమతి పొందడానికి గల కారణాలను వివరించారు విమర్శకులు.

మీనారాణి ఎంతో అనుభూతిని పొందింది. ఆ సభలో తన బావ ముఖంలోకి చూసింది. అతనిలో చలనం లేదు. ఆ కథ బాగుందని కానీ, బాగోలేదని కాని అతని ముఖ కవళికలు, చూపులూ వీసమంత కూడా వ్యక్తంచేయడంలేదు.

సభ ముగిసింది.

మీనారాణి, ఆమె బావ యింటికి వచ్చేశారు. దార్లో కూడా బావ ఏమీ మాట్లాడకపోవడం మీనారాణికి బాధగానే వుంది. తను రాసిన ప్రతి కథా బావకు చదివి వినిపించి యీ ఒక్క కథే చదివి వినిపించలేదని కోపమేమో అనుకుంది.

వినిపించకపోవడానికి కారణం – మూగవాడిని గురించి రాసిన కథ కదా, బావ బాధపడతాడేమోననే గాని బావను లెక్కచేయకపోవడం కాదని – తన మనసుకు తెలుసు. బావ ఆ మాత్రం గ్రహించుకోలేడని తను అనుకోలేదు – అతని అవగాహన మీద, తెలివి మీద తనకానమ్మకం వుంది.

అయితే బావ ఎందుకు అంత నిర్లిప్తంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయకుండా వుండిపోయాడో తనకు అర్థంకావడంలేదు.

చివరకు తనకు చదివి వినిపించకుండా పోటీకి కథ పంపించానని కోపమే వచ్చివుంటుందన్న నిర్ణయానికి వచ్చింది మీనారాణి.

ఆ రాత్రి మీనారాణి తన గదిలో కూర్చుని ఏదో రాయాలని తాపత్రయపడుతోంది. మనసు ఎంతసేపూ బావ ప్రవర్తన గురించే ఆలోచిస్తోంది గాని రాయడానికి మొగ్గడంలేదు.

చివరకు 'బావ మనసు యింత సంకుచితమైనదా? అందరూ అంతగా మెచ్చుకొని, అంతగా నన్ను అభినందిస్తే ఒక్కసారి మాటవరసకు – కథ చాలా బాగుంది అని చూపులతోటో సైగలతోటో అభినందిస్తే బావ సొమ్మేం పోతుంది? ఏం కొంపలు మునిగిపోతాయి.'

'అందరిలాగా వుపన్యాసాలివ్వడానికి మూగవాడని నాకెలాగూ తెలుసు.' అనుకుంది మీనారాణి.

కలం కాగితం తీసుకుంది.

ఏదో ఆవేశంలో ఏదో రాయాలని మొదలుపెట్టింది. 'సముద్రపు లోతుల్ని కొలవవచ్చుగాని మనిషి మనసు లోతుల్ని కొలవడం సాధ్యంకాదు. నిన్నటివరకూ దేవుడిలా అగుపించిన మనిషే నేడు దెయ్యంగా మారిపోవచ్చు. మనిషి మనసు చిత్రమైంది.' అని రాసి ఒక్క క్షణం అలాగే పెన్ను పట్టుకొని రాయకుండా ఆగిపోయింది.

'బావను దెయ్యం' అని రాసినందుకు తన మనసు ఎందుకో నొచ్చుకుంది.

ఇంతలో ఆమె కలంపట్టిన చేతిమీద మల్లెలవాన కురిసింది.

బావ దోసెడు మల్లెలు తెచ్చి ఆమె చేతిమీద కలం మీద పోసేడు. కాదు పూలతో పూజించాడు.

మీనారాణి వెనక్కి తిరిగి చూసింది.

వెనక బావ నవ్వుతూ నిలబడ్డాడు.

ఆ నవ్వులలో 'నీ కథ అంత బాగుంది' అన్న భావన స్పష్టమైంది.

బావ గురించి తను యింతవరకూ వూహించిన వూహలన్నీ తప్పని తెలియగానే ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

కుర్చీలోంచి లేచి బావముందు దోషిలా నిలబడింది మీనారాణి - ఒక్క క్షణం నీళ్ళు నిండిన కళ్ళతో బావ ముఖంలోకే చూస్తూ వుండిపోయింది. కన్నీటి తెర మాటునుంచి స్పష్టంగా కనిపించడంలేదు ఆమెకు. కళ్ళు తుడుచుకుంది.

బావ ఎంతో ఎత్తుగా అగుపించాడు ఆమెకు. 'మాటలు వచ్చినవారూ - మాటలు నేర్చినవారూ - ఎందరో నా కథను పొగిడారూ - నన్నభినందించారు. కాని బావ - మాటలకందని మనసు భాషలలో నుంచి పొందిన యీ అభినందనకు - సాటికావు అవన్నీ,' అంటూ అతని చేతులను తన చేతుల్లోకి తీసుకొని కళ్ళకు అద్దుకుంది.

★ ★ ★